


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -149-

**(13 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**రచయితలు** పేరుకోసం ఆశించకుండా రచనలు సాగించాలని కొందరు భాషాభిమానుల అభిలాష. అంటే కేవలం పేరు కీర్తులకోసం, లేదా ఆత్మ సంతృప్తికోసం, లేదా భాషను అభివృద్ధిపరచాలనే ఆవేశంలో మాత్రమే కలం తీసుకోవాలని వీరి అభిప్రాయం.

"ఎవడాపగలడీ ప్రవాహమును దేవీ" అని సరస్వతితో చెప్పి కలంచేత పట్టి కమ్మని కవిత్వాన్ని సృష్టించే ప్రతిభగల వారెవరుంటారు ఈ కాలంలో అనేది ఒక పెద్ద ప్రశ్న. ఉంటే గర్వించతగిన విషయమే.

సరస్వతి పూర్వం ఏ కొద్దిమంది చేతికో గంటం అందించి మంచి కవిత్వాన్ని వ్రాయండి. వేరే ఆలోచనలను పెట్టుకోకండి అని చెప్పివుంటుంది. వారు అలాగే కవితా సేవ చేశారు.

తర్వాత తర్వాత వారిలోనూ కొందరు రాజులవద్ద చేరి కానుకలు, సన్మానాలు పొందడం అలవాటు చేసుకున్నారు. పోను పోను "నిరువహతిస్థలంబు రమణీ. ప్రియ దూతిక తెచ్చి ఇచ్చుకప్పురపు వీడెం వగైరాలు" వుంటేగాని గంటం నడవదనే స్థితికి వచ్చారు.

అంటే ఏమన్నమాట? అత్తగారిని ఆకట్టుకుని కోడల్ని ఆహ్వానించడంలోకి వచ్చిందన్నమాట. ఒక్క పోతన్నగారు మాత్రం అత్తను తలవకుండా కోడల్ని కొలిచి అఖండ కీర్తి సంపాదంచుకున్నారు.

ఆయన సంగతి అలా వుంచండి తక్కిన వారు కవిత్వాన్ని సొమ్ముకోసం బయట పెట్టడందాకా వచ్చారన్న మాటేగా. దీనికి ఇంకోరకమైన వ్యాఖ్యానం కూడా చెప్పుకోవచ్చు. కవి అన్నవాడికి ఎలాటి చిక్కులూ, చిరాకులూ వుండకూడదు. సంతుష్టాంతరంగుడై వుండాలి. మరీ మాటాడితే పిల్ల జమిందరై వుండాలి. అప్పుడుగాని సరి అయిన కవిత్వం వ్రాయడానికి వీలులేదు.

పాల బాకీలు, ఇంటి అద్దెలు, బజారు వెచ్చాల బాకీలు వగైరాలుంటే ఎవరో ఒకరు వచ్చి మూడ్ చెడగొడతారు. మళ్ళీ ఆ పాకంలో కవిత్వం పడాలంటే ఎంతో కష్టం. కనుక కవిని ఏ పరిస్థితులు రవంతగా కూడా "డిస్టర్బ్" చేయకూడదు. అని వారి తాత్పర్యమైకూడా వుంటుంది.

నిజానికి ఇలాటి పరిస్థితులు రచయిత అన్నవాడికి అవసరమేకానీ ఎక్కడనుంచి వస్తాయి?

అలాటి హోదాతోనే కలం సాగించాలంటే కేవలం ధనవంతులు మాత్రం కలం చేతపట్టవలసి వస్తుంది. అది సులభం కాని రచయితలు సొమ్ము సంపాదించి భోగాలలో తూగడం అంత తేలిక పనికాదుగదా.

అందులో ఆ రోజుల్లో పత్రికలు లేవు గనక రచనలు అంత ప్రోత్సాహం లేదు. ఎవరో తప్పనిసరిగా ఆ వృత్తిలోకి దిగేవారు కాని ఎక్కువ మందికి ఆస్కారం లేదు. అప్పుడు పత్రికలంటూ వుంటే 'మను చరిత్ర' చక్కని వచన కావ్యంగా వెలసి ఏ పత్రికలోనో సీరియల్‌గా పడి, ప్రస్తుతం రెండుమూడు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంధంగా వుండేది. పెద్దనగారికేమిటి చాలామందికి వచనం మీద వ్యామోహం ఏర్పడేది. ప్రబంధాలన్నీ గ్రాంధిక పద్ధతి నవలలై గిడుగువారి పిడికిలి పోట్లకు నడుములు అప్పగించేవి.

సరే ఇప్పటి పరిస్థితి ఆలోచిద్దాం. ఈ రోజుల్లో డబ్బుకోసం ఆశించకుండా వ్రాసే వారెందరుంటారు. తీరా వ్రాసిన తర్వాత ఎవరూ పత్రికలో వేసుకోక పోవడం, ఏ పబ్లిషరూ వాసన చూడకపోవడం అప్పుచేసి అచ్చు వేయించుకుంటే అమ్ముడు కాకపోవడం. ఇలాంటి పరిస్తితులు సంభవించవచ్చుగాని డబ్బుమీద ఆశను, చొక్కామీద వ్రాలిన బొద్దింకను దులిపినట్లు ఎవరు దులిపి దూరంగా కొట్టగలరు?

అయితే వ్రాసేటప్పుడు మాత్రం దీనికి ఎంత డబ్బు వస్తుంది? ఎవరికి ఇస్తే వస్తుంది? ఎన్నాళ్ళకు వస్తుంది? ఇలాటి ప్రశ్నలు వేసుకోకుండా, చకచకా వ్రాసేసి, తీరికవుంటే ఫెయిర్‌చేసేసి అప్పుడు ఆలోచించడం మంచిదేమో.

కానీ ఏ డిటెక్టివులకో తప్ప అలా పంపగానే స్వీకరించే హోదా ఎందరి రచనలకు వుంటుంది. కనుక రచన ప్రారంభించినప్పటినుంచి 'రాబడి' ఆలోచన వుండనే వుంటుంది.

తెల్లారి లేస్తే ఎన్ని పత్రికలకు ఎన్ని బుక్‌పోస్టులు వెడుతున్నాయో, ఎన్ని తిరిగి వచ్చి రచయితలకు దీర్ఘ నిశ్వాసాలు కల్పిస్తున్నాయో పుస్తక ప్రచురణ కర్తలవద్దకు ఎన్ని కట్టలు వెడుతున్నాయో తిరిగి వచ్చి ఇళ్ళల్లో ఎన్ని గుట్టలు పడుతున్నాయో.

ఒక లక్షాధికారి భార్య కొన్ని కథలు వ్రాసింది. ఒకటి రెండు కథలు పత్రికలకు పంపింది. 'పంపినందుకు సంతోషం వెయ్యలేనందుకు విచారం' అనే కాగితం ముక్క ఒకటి సంపాదించుకుని అవి తిరిగి వచ్చాయి. ఈ సంగతి చెప్పి విచారం వెలిబుచ్చాడాయన.

"అయిదారు కథలు వ్రాశారన్నారుకదా! వాటిని మీరో పుస్తకంగా అచ్చు వెయ్యకూడదా?" అన్నాను.

"అలా అయితే ప్రచారం ఎక్కువరాదండి. పత్రికల్లో పడ్డ తర్వాత వెయ్యడం వేరు కదా. అదీ నేనాలోచించేది" అన్నాడాయన.

నిజానికి ఆయన ఆలోచించేది అదికాదు. అలా పత్రికల్లో పడితే ప్రచారంతోపాటు పదిరాళ్ళు వస్తాయి. ఆ రాళ్ళతో ఆవిడ ఏ రాళ్ళ నెక్‌లెస్సో చేయించుకుంటే మనస్సుకీ, దేహానికీ కూడా అలంకారం ఏర్పడుతుందనేదే ఆయనగారి భావం.

రచనల ద్వారా, ఉన్నవాళ్ళూ లేనివాళ్ళూ కూడా సొమ్ము సంపాదించాలని అభిలషిస్తుంటారు. వద్దనేదెవరు?

పత్రికల్లో పడ్డ రచనలు, పుస్తకరూపంలో రావాలని అభిలాష. అవి నవలలైతే, పాఠ్యగ్రంథాలుగా, లేదా సినిమా కథలుగా చెలామణి అవాలని కుతూహలం. వీలైతే ఒకటి, రెండు బహుమానాలు రావాలని ఆపేక్ష.

ఇలా ప్రతివారూ కోరుతూనేవుంటారు. ఇక అక్కడ లేదనేవారెవరు "భగవంతుని పాదార విందాలకు, భక్తి తత్పరతతో సమర్పణ"మని అంకితమిచ్చి ఆనందించేవాడెవరు?

ఏ ఒక్కరు ఏ హోదాలో కలం చేతపట్టుకున్నా పదిరాళ్ళు మూటగట్టి తెచ్చుకుని, అగాధంగా వున్న జీవితంలో అలా వదిలి సంతృప్తి చెందుతామనే. రిజిస్ట్రార్ఫీసులో దస్తావేజుల వ్రాత దగ్గరనుంచి సరస్వతి దరహాస చంద్రికలవంటి సారస్వత సృష్టికి పూనుకునేవారి వరకూ కోరేది ధనమే!

Post your comments